# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈనెల 15 నుండి రెండురోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు.**

**2. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

**3. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు.**

**4. అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.**

**5. ఏడాదిలో 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈనెల 15 నుండి రెండురోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో చేపడుతోన్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర గ్రాంట్లపై ముఖ్యమంత్రి పలువురు కేంద్ర మంత్రులతో చర్చించనున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో, భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్సులో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారు.

---------------------------

హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్ నిన్న ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపే అంశాలపై వారిరువురు చర్చించారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగ సంస్థలను పటిష్ట పరచడం కోసం అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించనున్నట్లు పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. రెండు రోజులపాటు విశాఖపట్నంలో జరిపిన పర్యటనలో 12 సంస్థల కార్యకలాపాలపై సమీక్షించి వాటి పనితీరు, నిర్వహణ, ఆయా సంస్థల ఆడిట్ గురించి తెలుసుకున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రతి సంస్థ తమ కార్యకలాపాలను ప్రతి ఏటా ఆడిట్ చేయించి ఆ నివేదికలను తదుపరి సంవత్సరంలో అసెంబ్లీకి సమర్పించాలన్నారు.

-----------------------------

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో టిడ్కో ఇళ్ళను, వంతెన నిర్మాణం పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. 2 కోట్ల రూపాయలతో కాలువపై వంతెన నిర్మాణం చేపడుతున్నట్టు మన్నారు. ఈ ఏడాదే టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామని పేర్కొంటూ..

..వాయిస్ .... 24 సెకన్లు

-----------------------------

2024-25 సంవత్సరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ పనితీరు కనబరిచడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు సామాజిక మాధ్యమం వేదికగా అభినందనలు తెలిపారు. విజయవాడ, గుంటూరు తిరుపతి నగరపాలక సంస్థలు ప్రతిష్టాత్మక సూపర్ స్వచ్ఛ లీగ్‌లో చేరాయని పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ కేటగిరీ కింద మినిస్టీరియల్ అవార్డు గెలుచుకుందని, రాజమహేంద్రవరం రాష్ట్ర స్థాయి మినిస్టీరియల్ అవార్డు అందుకుందని తెలిపారు.

అదే విధంగా ఈ నెల 17 న డిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ నుంచి అవార్డులు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అవార్డులు అందుకోనున్నారు.

-----------------------------

ఉత్తరాంధ్రను లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖ సాగరమాల కన్వెన్షన్ సెంటర్లో నిన్న నిర్వహించిన రోజ్ గార్ మేళాలో 52 మందికి నిన్న ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రను లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో తీరం వెంబడి జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొంటూ..

వాయిస్... 32 సెకన్లు

-----------------------------

అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని పేర్కొంటూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

ఏడాదిలో 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన నిన్నపాల్గొన్నారు. స్థానిక శాసన సభ్యులు బోనెల విజయ్ చంద్రతో కలసి ఇంటింటికి వెళ్లి కూటమి పాలన, చేపడుతోన్న అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు.

---------------------------

సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనాల ప్రకారం.. ఈ రోజు నుంచి ధవళేశ్వరం వద్ద గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ వెల్లడించారు. శనివారం సాయంత్రం 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41 అడుగులుగా ఉందని, ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5 లక్షల 29 వేల క్యూసెక్కులు నమోదైనట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలో వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

లార్డ్స్ వేదికగా భారత్-ఇంగ్లాండ్ క్రికెట్ జట్ల మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ కొనసాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఇంగ్లాండ్ కేవలం ఒక్క ఓవర్ మాత్రమే బ్యాటింగ్ చేయగలిగింది.మూడోరోజు ఆటముగిసే సమయానికి ఇంగ్లాండ్ జట్టు 2 పరుగుల స్కోర్ వద్ద కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ -ఇంగ్లాండ్ లు సమంగా 387 పరుగులు స్కోర్ చేసి ఆలౌట్ అయ్యాయి.

====================